

ఎత్తిపోతలకు సిద్ధం

ఎస్సారెస్పీ నుంచి లక్ష్మి కాలువ లిఫ్ట్ ద్వారా ఆయకట్టుకు నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
39.4 /25.8

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్మూర్ అభివృద్ధికి కృషి చేస్తా



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణాభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నూతన చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెబిన్‌హందాన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డిలు చైర్‌పర్సన్ లావణ్యను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధి ఆప్కే నికట్‌తో సమస్యలు పరిష్కారం



నిజామాబాద్ సిటీ: నిధి ఆప్కే నికట్ కార్యక్రమంతో ప్రతినెలా పీఎఫ్ చందాదారుల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని పీఎఫ్ ఇన్‌చార్జి మేనేజర్ ఇందూర్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ సంయుక్తంగా ఈపీఎఫ్‌వో నిధి ఆప్కేనికట్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. పీఎఫ్ చందాదారులు, పెన్షనర్లు కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను, ఫిర్యాదులను తెలుపగా పీఎఫ్ కార్యాలయ అధికారులు వెంటనే పరిష్కరించారు. ఈపీఎఫ్‌వో సంస్థలో వివిధ ప్రయోజనాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, అర్హత అవసరాలు, కేవైసీ అనుసంధానం గురించి, చందాదారుల పేర్ల మార్పిడి, ఈడీఎల్ఐ ఇన్సూరెన్స్ అర్హత, ప్రయోజనం గురించి అకౌంట్ ఆఫీసర్ రాఘవేందర్ చందాదారులకు వివరించారు. అధికారులు, చందాదారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తుతో బైపాస్ రోడ్డు భూసేకరణ



వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ మీదుగా ఉన్న జాతీయ రహదారిని బైపాస్ ద్వారా నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు బుధవారం పోలీసు బందోబస్తు ద్వారా భూసేకరణ చేశారు. 63వ నంబరు జాతీయ రహదారిని విస్తరించేందుకు ఇటీవల అధికారులు భూసేకరణ చేపట్టారు. వేల్పూర్ క్రాస్ రోడ్డు నుంచి అంక్సాపూర్, పడగల్ ఒడ్డెర కాలనీ, అంక్సాపూర్ మీదుగా కాకుండా బైపాస్‌రోడ్డు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. బైపాస్ నిర్మిస్తే భూములు కోల్పోయి రోడ్డున పడుతామని రైతులు అధికారులను కోరుతూ వస్తున్నారు. కానీ అధికారులు ఇటీవల గ్రామం మీదుగా సర్వే నిర్వహించారు. బైపాస్ రోడ్డు కోసం పంట భూములను కూడా కొలత చేయడానికి నిర్ణయించారు. గ్రామం మీదుగా ఉన్న రోడ్డునే కొలత చేసినప్పుడు తిరిగి బైపాస్ కోసం ఎందుకు కొలత చేస్తారని రైతులు ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశం ప్రకారం రెండు విధాలుగా నివేదిస్తామని రైతులకు వివరించారు. సాధ్యమైనంత మేరకు రైతులకు మేలు చేయడానికే మొగ్గు చూపుతామని సముదాయించారు. దీంతో రైతులు శాంతించారు. ఎస్సై వినయ్‌కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, తహసీల్దార్ సరిత రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహించారు.

చెరువులకు ఎసరు!

- కబ్జాలతో కనుమరుగవుతున్న వైనం
- ఆరు ఎకరాలకు కుదించుకుపోయిన 32 ఎకరాల రామర్తి చెరువు
- అటవీ భూమిలోని బ్రహ్మ చెరువును కబ్జాచేసి వెంచర్ వేసిన అక్రమార్కులు
- భూదందాలో ముఖ్య ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర



రామర్తి చెరువును ఆక్రమించి చదును చేసిన స్థలం ఇదే..



ముస్సిపల్ కంచెను తొలగించిన ప్రాంతం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ భూములు, పులాంగ్ వాగు, కెనాళ్లను కబ్జా చేసిన అక్రమార్కులు చెరువులను సైతం వదలడం లేదు. బోధన్ రోడ్డులో అర్సపల్లి రామర్తి చెరువు మొత్తం 32 ఎకరాలుండగా ప్రస్తుతం అది ఆరు ఎకరాలకు కుదించుకుపోయింది. ఈ చెరువును ప్రధాన రహదారి వైపు, వెనుక వైపు దాదాపు 80 శాతం ఆక్రమించి అక్రమంగా ప్లాట్లు చేసి కొందరు ముఖ్యమైన ప్రజాప్రతినిధులు యథేచ్ఛగా అమ్మేసుకున్నారు. రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ అధికారులు తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంతో చెరువును ఎక్కువ విస్తీర్ణంలో పూడ్చేశారు. గతంలో ఆక్రమణకు గురైన చెరువును వదిలిపెట్టి మిగిలిన కొంతభాగానికి రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ వేశారు. తాజాగా ఈ మిగిలిన భాగంపై సైతం కన్నేసిన కబ్జాకోర్లు అధికారులు వేసిన ఫెన్సింగ్‌ను యథేచ్ఛగా తొలగించేస్తున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులదే ముఖ్య పాత్ర. ఎక్కడికక్కడ మొరంతో చెరువును నింపేస్తూ బౌండరీలుగా ఫెన్సింగ్‌లు వేసుకుని అక్రమమార్గంలో పత్రాలు సృష్టిస్తున్నారు. తర్వాత అమాయకులకు అమ్మేస్తున్నారు. కొందరు ప్రబుద్ధులు నకిలీ పత్రాలు సృష్టించి 500 చదరపు గజాలు, 600 చదరపు గజాలు, 1000 చదరపు గజాల మేర భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేసుకున్నారు. ఇలా ఆక్రమించినవారిలో ఎంఐఎం, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులున్నారు. కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన కొందరు వ్యక్తులు కబ్జాదారుల దందాకు పూర్తి దన్నుగా నిలుస్తుండడం గమనార్హం. నగరానికి చెందిన ప్రధాన ప్రజాప్రతినిధులు మాత్రం తమకు ఎదురే లేదన్నట్లు దందా చేస్తున్నారు. ఇక రామర్తి చెరువు అభివృద్ధి కోసం గతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి వేసిన పైలాన్‌ను సైతం అక్రమార్కులు మాయం చేశారు. ప్లేగ్రౌండ్, పార్క్, కమ్యూనిటీ హాల్, లైబ్రరీ, హెల్త్ సెంటర్, ఓపెన్ జిమ్ లాంటివి ముస్లిం మైనారిటీ కాలనీల్లో ఎక్కడా కనిపించవు. వీటిని ఏర్పాటు చేసే విషయమై చొరవ చూపని ప్రజాప్రతినిధులు, అధికారులు.. అక్రమార్కులు చెరువులను కబళిస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటని పలువురు అంటున్నారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి కష్టపడి సంపాదించిన డబ్బులను వెచ్చించి ఇలాంటి అక్రమ వెంచర్లలో స్థలాలు కొనుక్కున్న వారు ఇప్పుడు బాధపడుతున్నారు.

■ స్లాటర్ హౌజ్ వెనుక జల్‌తలాబ్ అనే ప్రాంతంలో గుట్టల మధ్య ఉన్న సహజసిద్ధమైన బ్రహ్మ చెరువు పక్కన ఉన్న అటవీ భూమిలో సైతం ఓ కీలక ప్రజాప్రతినిధి అక్రమంగా వెంచర్ వేశాడు. అటవీ సరిహద్దు దిమ్మె వద్దనే ఏకంగా వెంచర్ సరిహద్దు రాయి పాతారు. ఇక్కడికి వెళ్లేందుకు రోడ్డు సైతం లేకపోవడంతో స్లాటర్ హౌజ్ వెనుక ఉన్న గోడను కూల్చి రోడ్డు వేశారు. అక్రమ వెంచర్‌లోనూ రోడ్డు వేయడం గమనార్హం. బ్రహ్మ చెరువుకు సమీపంలోని బాబన్‌సాబ్ పహాడ్ వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల సమీపంలో 2230, 2231, 2232, 2233, 2222, 2237 సర్వే నంబర్లలో అనధికారికంగా, అక్రమంగా లేఅవుట్లు వేసి ప్లాట్లు అమ్మకాలు చేస్తున్నారు. వీటిలోనూ ప్రజాప్రతినిధులదే కీలక పాత్ర కావడం గమనార్హం.



చెరువు ఆక్రమించి మొరం పోసి ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేస్తా



చెరువుల ఆక్రమణల విషయమై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు అన్ని వివరాలతో ఫిర్యాదు చేస్తా. గతంలో ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు లేవు. ఆక్రమించిన భూముల్లో వేసిన వెంచర్లలో సామాన్యులు కష్టపడి సంపాదించిన డబ్బులతో స్థలాలు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో నష్టపోతారు. ఇలాంటి స్థలాల్లో నిర్మించిన కట్టడాలను ప్రభుత్వం ఎప్పటికైనా కూల్చేస్తుంది. ఇలాంటి స్థలాల్లో మత సంబంధ నిర్మాణాలు సైతం చేయకూడదు. కబ్జాలు చేసి సహజ వనరులను కబళిస్తున్న ప్రజాప్రతినిధులకు బుద్ధి చెప్పాలి.

– సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్ నాయకుడు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి

- ఖరారు చేసిన పార్టీ అధిష్టానం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ టికెట్‌ను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డికి పార్టీ కేటాయించింది. బుధవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) సమావేశంలో ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. జీవన్‌రెడ్డి స్వస్థలం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బత్కేపల్లి. ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మల్యాల సమితి ప్రెసిడెంట్‌గా రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారు. తర్వాత తెలుగుదేశంలో చేరి 1983లో తొలిసారి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పని చేశారు. 1985 కాంగ్రెస్‌లో చేరి టీడీపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. 1989 నుంచి 1994 వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేశారు. అనంతరం 1994లో మరోసారి టీడీపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో, 2004 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. మొత్తం ఇప్పటి వరకు ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా.. ఉమ్మడి రాష్ట్రంలో మూడుసార్లు మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌పై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ చేతిలో ఓడిపోయారు. అనంతరం 2019లో కరీంనగర్ గ్రాడ్యుయేషన్ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందారు. జీవన్‌రెడ్డికి జగిత్యాల్, కోరుట్ల నియోజకవర్గంలో మంచిపట్టు ఉండడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారనే పేరు ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత కావడం, ప్రజల్లో మంచి గుర్తింపు ఉండడంతో పార్టీ అధిష్టానం జీవన్‌రెడ్డి వైపు మొగ్గుచూపింది.

బాసరలో ప్రేమికుల ఆత్మహత్య?

- రైలు కిందపడి సూసైడ్!
- మృతులు నిజామాబాద్ వాసులు



రైలు పట్టాలపై యువతి మృతదేహం



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి/భైంసా: నిర్మల్ జిల్లా బాసర రైల్వే స్టేషన్‌లో ప్రేమికులుగా భావిస్తున్న ఇద్దరి ఆత్మహత్య కలకలం రేపింది. రైలుకింద పడి యువతీయువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. బాసర రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి నర్సాపూర్–నాగర్‌సోల్ రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. యువతి మెడలో ఉన్న ఐడీకార్డు ఆధారంగా నిజామాబాద్‌లోని ఓ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థిని చక్రవర్తుల నందిత(20)గా గుర్తించారు. యువకుడి మృతదేహం బాగా దెబ్బతినడంతో వివరాలు తెలియరాలేదు. నిజామాబాద్ నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన నందిత బుధవారం కాలేజీకి వెళ్లి తిరిగిరాలేదు. మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులు ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో నందిత బాసర ఆలయానికి వెళ్లి ఉంటుందని కారేగాంకు చెందిన బంధువు విఠల్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆలయ పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లి వాకబు చేయగా ఇద్దరు చనిపోయినట్లు ప్రయాణికులు తెలిపారు. వెళ్లి చూడగా చనిపోయిన యువతి నందితగా గుర్తించాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. యువకుడి సెల్‌ఫోన్ పగిలిపోవడంతో వివరాలు తెలియరాలేదు. వారు ప్రేమ కారణంతో మృతి చెందారా అనే కోణంలో రైల్వే పోలీసులు విచారణ చేపడుతున్నారు. నందిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మోదీకి నచ్చితే జేబులో.. లేకపోతే జైల్లో..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

- కాంగ్రెస్ పక్కా 420 ప్రభుత్వం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: ప్రధాని మోదీకి నచ్చినవాళ్లు ఉంటే జేబులో.. నచ్చని వాళ్లు జైల్లో.. ఉంటారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఆరోపించారు. 'మోదీకి జై అంటే.. ఈడీకి నై.. బేడీలకు నై..' అని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని.. ఇది పక్కా 420 ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 111 రోజులు కావస్తుందని.. జనాలకు మూడు నామాలు పెట్టిందే తప్పా గ్యారంటీలు అమలు చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది అక్రమ అరెస్టని పేర్కొన్నారు. అవినీతికి పుట్టిన కవలలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పోరాటాల నుంచి పుట్టింది బీఆర్ఎస్ పార్టీ అని.. ఈ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. అసలు బీజేపీ నేతలంతా జైల్లో ఉండాలని.. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో, కేంద్రంలో రాక్షస పాలన చేస్తూ రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. మా కార్యకర్తలపై ఒక్క దెబ్బ పడితే.. మేము వంద దెబ్బలు కొట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నేతలు సుజిత్ సింగ్ ఠాకూర్, సుదాం రవి చందర్, జెడ్పీటీసీ సుమలత, పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు మీసాల ముధకర్‌రావు, నందిపేట మండలాధ్యక్షుడు మచ్చర్ల సాగర్, ఎంపీపీలు ప్రభాకర్, అనూష, మహేశ్ పాల్గొన్నారు.

స్పాట్ వాల్యూయేషన్‌లో సమస్యల తిష్ట

- సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం
- నిరసన తెలిపిన లెక్చరర్లు



ఇంటర్ అధికారి కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న లెక్చరర్లు

నిజామాబాద్అర్బన్: ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో వాల్యూయేషన్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది కన్నా ఈ సారి జవాబు పత్రాలు జిల్లాకు రెండు మూడురెట్లు ఎక్కువగా వచ్చాయి. అందుకు తగినట్లు ఏర్పాట్లు చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. దీంతో బుధవారం లెక్చరర్లు ఆందోళనకు దిగారు.

మూడింతలు పెరిగిన జవాబు పత్రాలు

జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయానికి ఈ ఏడాది ఇంటర్ జవాబు పత్రాలు గతంలో కంటే ఎక్కువగా వచ్చాయి. గతేడాది సుమారు లక్షా 50 వేలకు పైగా జవాబు పత్రాలు రాగా.. ప్రస్తుత సంవత్సరం నాలుగు లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. అందుకు తగ్గినట్లు సౌకర్యాలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పేపర్ వాల్యూయేషన్ కోసం సబ్జెక్టుల వారీగా టేబుళ్లు ఏర్పాటు చేస్తారు. గతేడాది గణితం 15, ఇంగ్లిష్ 14, ఫిజికల్ సైన్స్ 17, సివిక్స్ 16, లాంగ్వేజెస్‌కు సంబంధించి 14 టేబుళ్లు మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జవాబు పత్రాలు ఎక్కువగా రావడంతో గణితం 25, ఇంగ్లిష్ 24, ఫిజిక్స్ 25, సివిక్స్‌కు 26 టేబుళ్లలను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కి ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్, వాల్యూయేషన్ లెక్చరర్, సబ్జెక్టు నిపుణులు ఉంటారు. ఇలా మొత్తం 2500 మంది సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. గతంలో 1400 మంది వరకు ఉండేవారు. ఈ యేడు సిబ్బంది బాగా పెరగగా అందుకు తగినట్లు సౌకర్యాలు కల్పించడంలో ఇంటర్ అధికారులు విఫలమయ్యారు. కనీసం తాగునీరు సైతం సరిగ్గా దొరకడం లేదు. ఫ్యాన్లు, టేబుళ్లు, కుర్చీలు సరిపోను లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జవాబు పత్రాల వాల్యూయేషన్‌కు ప్రతియేటా రూ. మూడు నుంచి నాలుగు లక్షలను ఇంటర్మీడియట్ రాష్ట్ర అధికారులు మంజూరు చేసేవారు. కానీ ఈ యేడు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో ఇంటర్మీడియట్ అధికారులు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు.

సౌకర్యాలు కల్పించాలని..

వాల్యూయేషన్ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించాలని బుధవారం ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం ముందు సిబ్బంది బుధవారం ఆందోళన చేశారు. కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఇంటర్మీడియట్ అధికారి రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎక్కువ జవాబు పత్రాలు వచ్చాయి

ఈ ఏడాది వాల్యూయేషన్ కోసం ఇంటర్ జవాబు పత్రాలు ఎక్కువగా వచ్చాయి. గతంలో కంటే మూడింతలు ఎక్కువ రావడంతో కొంత ఇబ్బంది అవుతోంది. అయినా కూడా సౌకర్యాలు కల్పిస్తున్నాం. సిబ్బందికి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం.

– రవికుమార్, వాల్యూయేషన్ క్యాంపు ఇన్‌చార్జి

ఇందూరుకు పుంగనూరు ఆవులు



గోమాతలకు పూజలు చేస్తున్న జ్ఞానేందర్ దంపతులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరానికి చెందిన మంచాల జ్ఞానేందర్ గుప్తా బుధవారం పుంగనూరు నుంచి రెండడుగుల ఎత్తు మాత్రమే ఉండే పుంగనూరు ఆవులను తీసుకొచ్చారు. గోమాతలకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కొత్త వస్త్రాలు, పూలమాలలతో గోమాతలను అలంకరించారు. బ్రాహ్మణుడితో ప్రత్యేకంగా గోపూజ వైభవంగా చేశారు. ఇంట్లో తమతో సమానంగా కలియతిరిగే విధంగా ఉండేందుకు తీసుకొచ్చిన ఈ ఆవులకు లక్ష్మి, నారాయణులుగా పేర్లు పెట్టుకున్నట్లు జ్ఞానేందర్, శ్రీలక్ష్మి దంపతులు తెలిపారు. శునకాలకు బదులుగా గోవులను పెంచుకోవడం మేలుచేస్తుందని పేర్కొన్నారు.



ఉత్సాహంగా 5కే రన్

నిజామాబాద్ నాగారం: నెహ్రూ యువ కేంద్రం, జిల్లా క్రీడల అధికారి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో 'ఓటు ఫర్ ష్యూర్' పేరిట నిర్వహించిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. రన్‌ను మున్సిపల్ కమిషనర్ మకరందు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రన్‌లో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శంకర్, స్వీప్ నోడల్ అధికారి సురేష్ కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న, జిల్లా యువజన అధికారి శైలీ బెల్లాల్, మున్సిపల్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతర్

- పేపర్ వాల్యూయేషన్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లతో సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



నిజామాబాద్‌లోని ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో సెల్‌ఫోన్‌లు వినియోగిస్తున్న సిబ్బంది

నిజామాబాద్అర్బన్: ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్పాట్ సెంటర్‌లో ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా సెల్‌ఫోన్‌లు వినియోగిస్తున్నారు. నిజామాబాద్‌లోని స్పాట్ సెంటర్‌లో జవాబు పత్రాల మూల్యాంకనంలో 2,300 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. స్పాట్ సెంటర్‌లలోకి సెల్‌ఫోన్లను అనుమతించవద్దని రాష్ట్ర ఇంటర్ అధికారులనుంచి ఆదేశాలున్నాయి. అయినా నిజామాబాద్‌లో మాత్రం ఎవరూ ఈ నిబంధనను పాటించడం లేదు. మూల్యాంకనంలో పాల్గొంటున్న సమయంలోనూ సెల్‌ఫోన్లను వినియోగిస్తున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

క్లుప్తంగా

కొనసాగుతున్న సెమిస్టర్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న బీపీఈడీ మొదటి, మూడవ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఆర్మూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో నిర్వహించిన పరీక్షకు 81 మందికి 77 మంది హాజరు కాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్‌: గిరిరాజ్‌ కళాశాలలో పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్‌ రాంమోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2, 4, 6వ సెమిస్టర్‌, బ్యాక్‌లాగ్‌ 1, 6వ సెమిస్టర్‌ పరీక్షల ఫీజు గడువును ఈ నెల 27 ఏప్రిల్‌ 12వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్‌ 12వ తేదీ వరకు రూ. 500, 15వ తేదీ వరకు రూ. వెయ్యి అపరాద రుసుముతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌ వీడీసీ సభ్యులను తహసీల్దార్‌ కిరణ్మయి ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై తిరుపతి బుధవారం తెలిపారు. గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమ రవాణా చేసేందుకు వీడీసీ సభ్యులు వేలం ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని తెలిసి ఏడుగురు వీడీసీ సభ్యులను తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షల పూచీకత్తుపై బైండోవర్‌ చేశామన్నారు. వాగుల నుంచి ఇసుక తరలించే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉందన్నారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేకంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చైర్మన్‌పై వీగిపోయిన అవిశ్వాసం



ధర్పల్లి: మండలంలోని రామడుగు సొసైటీ చైర్మన్‌ రాజేందర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు డీసీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. చైర్మన్‌పై మెజార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మాన నోటీసును ఈ నెల 4న డీసీవోకు అందజేశారు. తీర్మానం మేరకు అవిశ్వాస పరీక్షను బుధవారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరుకాకపోవడంతో కోరం లేక తీర్మానం వీగిపోయింది. అవిశ్వాసం వీగిపోవడంతో రాజేందర్‌ చైర్మన్‌గా కొనసాగుతారని డీసీవో ప్రకటించారు. సీఈవో ప్రవీణ్‌రెడ్డి, పోశన్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



రుద్రూర్‌: విద్యార్థులు చట్టాలపై అవగాన కలిగి ఉండాలని ఎస్సై అప్పారావు అన్నారు. మండలంలోని ఫుడ్‌ సైన్స్‌ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం పోలీస్‌ కళా బృందం ఆధ్వర్యంలో సైబర్‌ నేరాలు, ర్యాగింగ్‌, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు భద్రత కోసం షీ టీమ్‌ ఉందని, అత్యవసర సమయాల్లో డయల్‌ 100 ఉపయోగించాలని సూచించారు. సీసీ కెమెరాలు, హెల్మెట్‌ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై రాజు, కళాశాల అసోసియేట్‌ ఇన్‌చార్జి డీన్‌ వెంకట్‌ రెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జి జయప్రకాశ్‌, కళాబృందం సభ్యులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు సిద్ధం

- లక్ష్మి లిఫ్టు ఎత్తిపోతలకు కరెంట్‌ సరఫరాను పునరుద్ధరించిన అధికారులు



లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ వద్ద తగ్గిన నీరు



లక్ష్మి లిఫ్టు మోటార్లు



రిపేర్‌ చేస్తున్న మెకానిక్‌

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి లక్ష్మి కాలువ ద్వారా కాలువ ఆయకట్టు భూములకు నీరు ఎత్తిపోసేందుకు లక్ష్మి లిఫ్టు సిద్ధంగా ఉంది. ఈ కాలువ ద్వారా ప్రాజెక్ట్‌ నీటి మట్టం 1062 అడుగుల వరకు మాత్రమే చేపట్టవచ్చు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062.5 అడుగుల నీరు ఉంది. దీంతో మరో రెండు రోజుల్లో లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ ఎత్తిపోతుంది. లక్ష్మి కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ వరకు నీటి సరఫరా చేసేందుకు 1045 అడుగుల నీటి మట్టం వద్ద లిఫ్టును నిర్మించారు. లిఫ్టుకు విద్యుత్‌ సరఫరా లేక ఇబ్బందిగా ఉండేది. దీంతో ఆయకట్టుకు నీటి సరఫరా చేపడతారా లేదా అని ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించడంతో విద్యుత్‌ సరఫరా కొనసాగుతోంది. మోటార్లను సైతం సిద్ధం చేశారు. స్వల్ప మరమ్మతులు ఉంటే వాటిని కూడా సరి చేస్తున్నారు. లిఫ్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొంటున్నారు.

మూడోసారి..

ప్రాజెక్ట్‌లో నిర్మించిన లిఫ్టు ప్రస్తుత సంవత్సరం ఎత్తిపోస్తే మూడో సారి అవుతుంది. 2018, 2019లో లిఫ్టు ద్వారా నీటిని ఎత్తిపోసి కాలువ ద్వారా ఆయకట్టుకు నీటి సరఫరా చేపట్టారు. ప్రస్తుతం కూడా చివరి తడి వరకు నీరు అందాలంటే లిఫ్టు ద్వారా నీటి సరఫరా చేపట్టాలి. ఇప్పుడు ఎత్తిపోస్తే మూడో సారి వినియోగించబడుతుంది. ప్రాజెక్ట్‌ నుంచి సరస్వతి, కాకతీయ కాలువల ద్వారా 1045 అడుగుల నీటి మట్టం వరకు నీటి సరఫరా చేపట్టవచ్చు. కానీ లక్ష్మి కాలువ ద్వారా మాత్రమే 1062 అడుగుల నీటి మట్టం వరకు చేపట్టవచ్చు. దీంతో అన్ని కాలువలకు సమానంగా నీటి సరఫరా చేపట్టాలని 2007లో నాటి ప్రభుత్వం లిఫ్టు నిర్మాణానికి రూ. 25 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు పదేళ్లకు 2018లో పూర్తయ్యాయి. అప్పుడే ట్రయల్‌రన్‌తో నీటి సరఫరా చేపట్టారు. ప్రతి ఏడాది చివరి వరకు నీరు అందక పంటలు ఎండిపోయేవి. ప్రస్తుతం అలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. లిఫ్టు నిర్వహణ సక్రమంగా చేపడితే ఆయకట్టు రైతుల పంటలు చివరి వరకు నీరందుతుంది. లక్ష్మి కాలువ ఆధారంగా ఉన్న లిఫ్టుల ఆయకట్టు కలుపుకొని 50 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. హెడ్‌ రెగ్యులేటర్‌ ఎత్తిపోగానే లిఫ్టు ద్వారా నీటి సరఫరా చేపడతామని ప్రాజెక్టు అధికారులు పేర్కొంటున్నారు.

పరిశోధనలు పొలాల్లోకి చేరాలి



పంటల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రఘురామిరెడ్డి, ఇతరులు

- ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్‌ డైరెక్టర్‌ రఘురామిరెడ్డి

జగిత్యాలఅగ్రికల్చర్‌: వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలు పొలాల్లోకి చేరాలని, అప్పుడే రైతులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్‌ డైరెక్టర్‌ రఘురామిరెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వరి విస్తీర్ణం 21 శాతం పెరిగిందని, సోయాచిక్కుడు విస్తీర్ణం 10 శాతం పెరిగిందని, అయితే చెరుకు విస్తీర్ణం మాత్రం 73 శాతం, పెసర 61 శాతం, మొక్కజొన్న 12 శాతం, కందుల విస్తీర్ణం 8 శాతం, పత్తి విస్తీర్ణం నాలుగు శాతం తగ్గడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జగిత్యాలరూరల్‌ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణ జోనల్‌ స్థాయి శాస్త్రవేత్తల సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆయా జిల్లాల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. సిఫారసు చేసిన ఎరువుల కంటే భూసార పరీక్షల ఆధారంగా వాడితే 22.5 శాతం అధిక దిగుబడి వస్తుందని, ఇది శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలిందని గుర్తు చేశారు. వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ఎక్స్‌టెన్షన్‌ సుధారాణి మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. పంట దిగుబడే ప్రధానం కాదని, భూమిని సంరక్షించడం అంతే ముఖ్యమన్నారు. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలోని పొలాస, కూనారం, రుద్రూర్‌ పరిశోధన స్థానాల నుంచి రూపొందించిన జేజీఎల్‌-33124, జేజీఎల్‌-28639, జేజీఎల్‌-35085, జేజీఎల్‌-34560, కేఎస్‌ఎం-7037, ఆర్‌డీఆర్‌-1200, ఆర్‌డీఆర్‌-1162 రకాలు అనేకరకాల రోగాలను తట్టుకుని మంచి దిగుబడి ఇచ్చాయన్నారు. అగ్రికల్చర్‌ డిపార్ట్‌మెంట్‌ రాష్ట్ర డైరెక్టర్‌ బాలు మాట్లాడుతూ.. వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతు సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకరావాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు తమ పరిశోధన స్థానాల్లో యాసంగి సీజన్‌లో చేసిన పరిశోధనలు, చేస్తున్న పరిశోధన ప్రగతిని ఫొటో ప్రజెంటేషన్‌ ఇచ్చారు. అనంతరం వివిధ పంటల సాగుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

ప్రమోషన్‌ వచ్చినా రిలీవ్‌ చేయరట..!

- జిల్లాలో ఇద్దరు స్టాఫ్‌ నర్సులకు పదోన్నతి
- అయినా రిలీవ్‌ చేయని అధికారులు
- ఆదిలాబాద్‌ నుంచి వచ్చిన మరో స్టాఫ్‌నర్సును విధుల్లో చేర్చుకోని వైనం
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: వైద్య ఆరోగ్యశాఖ అధికారుల వింత ధోరణితో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ప్రమోషన్‌ వచ్చినా ఉన్నతాధికారులు రిలీవ్‌ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రమోషన్‌పై జిల్లాకు వచ్చినా ఇక్కడ విధుల్లో చేర్చుకోవడంలేదు. దీంతో పలువురు స్టాఫ్‌నర్సులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని స్టాఫ్‌ నర్సులకు రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా జిల్లాలోని అర్హులైన ఇద్దరికి ప్రమోషన్‌ వచ్చింది. మోపాల్‌ మండలం ముదక్‌పల్లి పీహెచ్‌సీలోని స్టాఫ్‌నర్సు సబితాకు హెడ్‌నర్సుగా ప్రమోషన్‌ వచ్చింది. ఈ నెల 14న ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆమె హైదరాబాద్‌లోని డీహెచ్‌ కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు వెళ్లింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌)లో విధుల్లో చేరాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఆమెను రిలీవ్‌ చేయలేదు. అలాగే ఎడపల్లిలో మరో స్టాఫ్‌నర్సు రాధాబాయి ఎంఎస్సీ నర్సింగ్‌ చేయడంతో పదోన్నతిపై మహబూబాబాద్‌ నర్సింగ్‌ కళాశాలలో లెక్చరర్‌గా ఈ నెల 15న పదోన్నతి వచ్చింది. కౌన్సెలింగ్‌కు హాజరడంతో ఆర్డర్‌ కాపీ ఇచ్చారు. ఇక్కడ కూడా అధికారులు ఆమెను రిలీవ్‌ చేయడం లేదు. మరో ఘటనలో ఆదిలాబాద్‌ జిల్లాలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న నాన్సీని మాక్లూర్‌ పీహెచ్‌సీకి బదిలీ చేశారు. దీంతో అక్కడి డీఎంహెచ్‌వో రిలీవ్‌ చేయడంతో ఇక్కడకు రాగా.. ఉన్నతాధికారులు విధుల్లో చేర్చుకోవడంలేదు. అయితే ప్రమోషన్‌, బదిలీ ఉత్తర్వులు ఇచ్చిన 15 రోజుల్లో ఉద్యోగులు విధుల్లో చేరాల్సి ఉంటుంది. లేదంటే పదోన్నతి రద్దవుతుంది. దీంతో సదరు ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు.

సాకులు చెబుతూ..

పదోన్నతి వచ్చిన స్టాఫ్‌నర్సులను డీఎంహెచ్‌వో రిలీవ్‌ చేయాల్సి ఉన్నా.. ఇదిగో అదిగో అంటూ పది రోజులు రిలీవ్‌ చేయడంలేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఆర్డర్‌ కాపీలో తప్పులున్నాయని.. ఎన్నికల కోడ్‌ ఉందని.. రకరకాల కారణాలు చెబుతూ తప్పించుకుంటున్నారని మదనపడుతున్నారు. ఇతర జిల్లాలోని ఉద్యోగులు ప్రమోషన్‌పై వెళ్లి విధుల్లో చేరారని.. ఇక్కడ మాత్రం తమను రిలీవ్‌ చేయడం లేదని వాపోతున్నారు. జిల్లాకు బదిలీపై వచ్చిన మరో స్టాఫ్‌నర్సుకు మూమెంట్‌ ఆర్డర్‌ ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమను రిలీవ్‌ చేయాలని కోరుతున్నారు. ఇదే విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనంను 'సాక్షి' సంప్రదించగా ఆయన ఫోన్‌ లిఫ్ట్‌ చేయలేదు.

మరణంలోనూ సమాజహితం కోరిన నాగేశ్వరరావు



ఆస్పత్రిలో నివాళులర్పిస్తున్న కుటుంబీకులు, ప్రజా సంఘాల నాయకులు



మాక్లూర్‌లో మాట్లాడుతున్న వెంకట్రామయ్య

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మాధవరావు
- మెడికల్‌ కళాశాలకు పార్థివదేహం అప్పగింత

నిజామాబాద్‌నాగారం: తాను మరణించినా తన దేహం సమాజానికి ఉపయోగపడాలనుకున్న గొప్ప వ్యక్తి మొవ్వ నాగేశ్వరరావు అని జేసీఎస్‌ ప్రసాద్‌ మెమోరియల్‌ ట్రస్ట్‌ మేనేజింగ్‌ ట్రస్టీ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి మాధవరావు అన్నారు. జంపాల చంద్రశేఖర్‌ ప్రసాద్‌ మెమోరియల్‌ ట్రస్ట్‌ సభ్యుడు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొవ్వ నాగేశ్వరరావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మెడికల్‌ కళాశాలకు బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా గొర్రెపాటి మాధవరావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమానతలు లేని సమాజం కోసం చివరి వరకు తన కర్తవ్యాన్ని కొనసాగించాడని అన్నారు. సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. నాగేశ్వరరావు మానవతా విలువలు కలిగి అందరితో కలిసి మెలిసి ఉండేవారన్నారు. ఆయన మృతి సంఘానికి విప్లవోద్యమానికి తీరని లోటని అన్నారు. సంస్మరణ సభలో ఉపాధ్యాయ నాయకులు వేణుగోపాల్‌, హన్మాండ్లు, శంకర్‌, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావుకు ఘన నివాళి

మాక్లూర్‌: మండలంలోని కొత్తపల్లికి చెందిన పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొవ్వ నాగేశ్వరరావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన సంస్మరణ సభకు అఖిల భారత రైతుకూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య హాజరై మాట్లాడారు. ఉద్యమంలో ఆయనతో పాటు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నాగేశ్వర్‌రావు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అప్పగించిన కుటుంబీకులను, కుమారులను అభినందించారు. నాయకులు గొర్రెపాటి మాధవరావు, ఆకుల పాపయ్య, దేశెట్టి సాయిరెడ్డి, గంగాధర్‌ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. యాదాద్రి జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో బాలబాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ జట్ల నుంచి జాతీయ స్థాయి పోటీలకు బాలురు నలుగురు, బాలికలు ఆరుగురు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29 నుంచి ఏప్రిల్‌ 1 వరకు మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి సబ్‌ జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన వారిలో కె సోనీ, ఎం గంగోత్రి, డి లిఖిత, బి నిశిత, కె సౌజన్య, కె సంహిత, బి చందు, ఆర్‌ నితిన్‌, కె జస్వంత్‌, ఎం నితిన్‌ ఉన్నారు. అనంతరం క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్‌ అభినందించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి చిప్ప నవీన్‌, జిల్లా కోచ్‌ నరేశ్‌, పీఈటీ పవన్‌ పాల్గొన్నారు.

కేటీఆర్‌పై ఫిర్యాదు



ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డిపై నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేసిన బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌బిన్‌ హందాన్‌ నగరంలోని ఒకటో టౌన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ అధికార ప్రతినిధి విద్యాసాగర్‌, అంతరెడ్డి విజయ్‌పాల్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ యార్డులో చోరీకి యత్నం



పసుపు బస్తాను స్వాధీనం చేసుకున్న అధికారులు

సుభాష్‌నగర్‌: నిజామాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ యార్డులో మంగళవారం రాత్రి ఓ ఆటో డ్రైవర్‌ సుమారు రూ.10వేల విలువైన పసుపు బస్తా దొంగతనానికి యత్నించాడు. సెక్యూరిటీ సిబ్బంది ఆటోను వెంబడించి బస్తాను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌ కమిటీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓ ఆటోడ్రైవర్‌ హోలీ సందర్భంగా మార్కెట్‌యార్డుకు మంగళవారం సాయంత్రం వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో గేట్‌ వద్ద సెక్యూరిటీ ఆటోను తనిఖీ కోసం ఆపేందుకు ప్రయత్నించారు. ఆటో ఆపకుండా వేగంగా వెళ్లడంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారమిచ్చే సమయంలో కళ్లుగప్పి ఆటోను వదిలేసి పరారయ్యాడు. సెక్యూరిటీ సిబ్బంది ఆటోను, పసుపు బస్తాను స్వాధీనం చేసుకుని యార్డుకు తరలించారు. కాగా పసుపు బస్తా దొంగతనాన్ని నిలువరించిన సెక్యూరిటీ సిబ్బంది సందీప్‌, సుమన్‌ను సెలక్షన్‌ గ్రేడ్‌ సెక్రటరీ వెంకటేశం అభినందించారు. వారిని నగదు బహుమతితో సన్మానించారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

డిచ్‌పల్లి: బర్ధిపూర్‌ శివారు అమృతగార్డెన్స్‌ వద్ద రాంగ్‌ రూట్‌లో వచ్చిన కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ముగ్గురు కిందపడగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలానికి చెందిన సుమన్‌, బాల్‌రాజ్‌, గంగరాజు పెళ్లి పత్రికలు పంచడానికి బైక్‌పై రామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన స్థలంలో ఆగిన మరో కారును వెనకనుంచి వేగంగా వచ్చి ఆటో ఢీకొన్నది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే అమృతాగార్డెన్స్‌ ఎదుట పార్లమెంట్‌ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న పోలీసులు వచ్చి సహాయ చర్యలు అందించారు. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి ఎనిమిది నెలల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: రైళ్లలో మొబైల్‌ ఫోన్లను దొంగిలించిన ఇద్దరు నిందితులకు ఎనిమిది నెలల జైలు శిక్షను విధిస్తూ రెండో రైల్వే మెట్రోపాలిటన్‌ కోర్టు (సికింద్రాబాద్‌) జడ్జి గౌస్‌ పాషా బుధవారం తీర్పునిచ్చారు. కామారెడ్డి జిల్లాకు చెందిన జూలు శ్రీకాంత్‌, నిజామాబాద్‌ జిల్లాకు చెందిన గజం సత్యం కామారెడ్డి నుంచి నిజామాబాద్‌ మధ్యలో నడుస్తున్న రైళ్ల లో తొమ్మిది సెల్‌ ఫోన్లను దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిజామాబాద్‌ రైల్వే ఎస్సైఎ సాయిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకొని సికింద్రాబాద్‌ రైల్వే మెట్రోపాలిటన్‌ కోర్టులో హాజరుపర్చగా కేసులను పరిశీలించిన జడ్జి నేరం రుజువు కావడంతో వారిపై ఎనిమిది నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసులో కోర్టు కానిస్టేబుల్‌ సుధీర్‌రాజ్‌,శరత్‌బాబు సహకరించారని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మద్నూర్‌(జుక్కల్‌): మండల కేంద్రంలోని అయ్యప్ప కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న మహజన్‌ బాలాజీ ఇంట్లో మంగళవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ సాయంత్రం 7 గంటల ప్రాంతంలో కిరాణ వస్తువుల కోసం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 10 తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన బాలాజీ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బిచ్కుంద సీఐ నరేశ్‌, మద్నూర్‌ ఎస్సై శ్రీకాంత్‌ విచారణ చేపట్టారు. విచారణలో మద్నూర్‌కు చెందిన శ్రీనును అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. గంటల వ్యవధిలోనే పోలీసులు దొంగను పట్టుకొని సొమ్ము రికవరీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

మాక్లూర్‌: మండలంలోని సామెల్‌ చెరువులో మంగళవారం లభించిన గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు బుధవారం తెలిపారు. బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన పిట్ల రాజు అలియాస్‌ చిన్న ఒడ్డెన్న(40)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. వెల్మల్‌లో అద్దెకు ఉంటూ కూలీ పనులు చేసుకునే రాజు ఆర్థిక ఇబ్బందులతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. బొంకన్‌పల్లిలో ఉన్న ఇల్లు గత వర్షాకాలంలో కూలిపోవటంతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బోధన్‌రూరల్‌: మండలంలోని మావందికుర్దు గ్రామంలో శిరీష (32) అనే వివాహిత గ్రామ శివారులోని పసుపు వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్‌ ఏఎస్సై రవీందర్‌ తెలిపారు. శిరీష భర్త ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. కొంత కాలం నుంచి ఆమె మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. అనారోగ్యంతో పాటు ఒంటరితనానికి లోనవుతూ మనస్థాపం చెంది మంగళవారం రాత్రి వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం చెరువు నుంచి మృతదేహాన్ని వెలికితీసి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



ఇందల్వాయి: మండలంలోని మేఘ్యానాయక్‌ తండా, దేవితండా, గండితండా, త్రయంబక్‌పేట్‌, డొంకల్‌ గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బృందం, జిల్లా టాస్క్‌ఫోర్స్‌ బృందం, భీంగల్‌ ఎక్సైజ్‌ పోలీసులు బుధవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో 20 లీటర్ల నాటుసారాతో పాటు వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని సీజ్‌ చేసి నలుగురిని అరెస్ట్‌ చేసినట్లు భీంగల్‌ ఎక్సైజ్‌ సీఐ వేణు మాధవరావు తెలిపారు. నాటుసారా తయారు చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు.

పేకాట స్థావరంపై..

దొంకేశ్వర్‌: మండలంలోని కోమట్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు మంగళవారం దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు చోట్ల పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్న పోలీసులు వారి నుంచి రూ.5వేల వరకు నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు.

బొప్పాపూర్‌లో అగ్ని ప్రమాదం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఆర్‌ఐ నజీర్‌

రుద్రూర్‌: మండలంలోని బొప్పాపూర్‌లో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రేకుల ఇల్లు దగ్ధమైంది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జై నాబి అనే వృద్ధురాలు రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అకస్మాతుగా మంటలు చెలరేగాయి. దీంతో వృద్ధురాలు బయటికి వచ్చి చుట్టు పక్కల వారిని పిలవడంతో వారు మంటలను ఆర్పివేశారు. అప్పటికే మంటలు ఎక్కువగా వీయడంతో రేకుల ఇంట్లో ఉన్న తులం బంగారం, వంట సామగ్రి, ఫర్నిచర్‌, బైక్‌ అగ్నికి ఆహుతులైనట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు వృద్ధురాలు తెలిపింది. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ నజీర్‌ ఘటన స్థలానికి ఉదయం చేరుకొని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ సభ్యులు నరోజీ గంగారాం తనవంతు సహాయం అందించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు పట్ల సురేశ్‌, విండో మాజీ వైస్‌ చైర్మన్‌ బాపూజీ లింగం ఉన్నారు.